జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 11 | జూన్ | 2026 ◆ పేజీలు : 8

## సాధారణ ప్రసవాలను పెంచి – మాతృ, శిశు మరణాలను తగ్గించాలి

- డి ఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 10 ,(ప్రజాజ్యోతి)** సాధారణ ప్రసవాలను పెంచి మాధురి సమాధానము ప్రకటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారం రాథోడ్ వైద్యులకు సూచించారు, బుధవారం డిఎం హెచ్వో కార్యాలయంలో

మిగతా 2 లో...



- గిరిజన కుటుంబ గడప వద్ద అర్ధరాత్రి అరాచకం
- ఒక్క వాయిదా ఆలస్యమైతే ఇంత దౌర్జన్యమా..?
- బాధితుల గౌరవానికి భంగం కలిగితే బాధ్యత ఎవరిది..?
- గిరిజన గ్రామాల్లో ఇలాంటి వసూళ్ల పద్ధతులకు ఎవరు అనుమతి ఇచ్చారు..?
- జిల్లా యంత్రాంగం ఇలాంటి ఘటనలపై ప్రత్యేక విచారణ చేపడుతుందా..?
- ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం
- రుణ వసూళ్ల పేరుతో మానవ హక్కులకు తూట్లు..?

# రాత్రి రెక్కలు విప్పిన ... ఫైనాన్స్ రౌడీయిజం..!

6 లో..

రుణాలు ఇచ్చే సంస్థలా..? లేక ప్రజలను భయ భ్రాంతులకు గురిచేసే ప్రైవేట్ సేనలా..? అనే ప్రశ్నలు తలెత్తేలా లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం గ్రామంలో చోటుచేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీ కు చెందిన సిబ్బంది రాత్రి వేళ గిరిజన కుటుంబం ఇంటి వద్దకు వెళ్లి హడావుడి చేయడం కుటుంబ సభ్యులను మానసిక ఒత్తిడికి గురిచేయడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పటికే చీకట్లు కమ్ముకున్న సమయంలో గిరిజన గ్రామంలో ఇంటి వద్దకు వెళ్లి గొడవకు దిగడం కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేయడం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

● కొత్తగూడెం, ప్రజాజ్యోతి

## గ్రామాల అభివృద్ధిలో ప్రజల సహకారం కీలకం : కలెక్టర్ అంకిత్



- ఎల్‌నినో ప్రభావంతో రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలి
- గ్రామసభలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష
- వ్యవసాయం, విద్య, పారిశుద్ధ్య అంశాలపై అధికారులకు సూచనలు

**అన్నపురెడ్డిపల్లి, జూన్ 10 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, వ్యవసాయ పరిస్థితులు, విద్యా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన ఈ గ్రామసభకు గ్రామ సర్పంచ్ లాకావత్ లక్ష్మి అధ్యక్షత వహించగా

మిగతా 2 లో...

## మావోయిస్టుల ఆయుధాలు స్వాధీనం



**చర్ల , జూన్ 10: (ప్రజాజ్యోతి ):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా–బీజాపూర్ సరిహద్దు ప్రాంతంలో భద్రతా బలగాలు నిర్వహించిన సంయుక్త గాలింపు చర్యల్లో నక్సలైట్లు దాచిపెట్టిన భారీ ఆయుధాలు, పేలుడు పదార్థాల నిల్వను స్వాధీనం చేసుకున్నారు. మల్యానగిరి జిల్లాలోని

మిగతా 2 లో...



# అతి వేగం... ఘోర ప్రమాదం

- రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని ఢీకొన్న కారు.
- నలుగురికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు.
- చికిత్స పొందుతూ మరణించిన చిన్నారి.
- లక్ష్మీదేవిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఘటన.

**పాల్వంచ, జూన్ 10 (ప్రజాజ్యోతి):** అతి వేగం మరోసారి ప్రమాదానికి కారణమైంది. రోడ్డుపక్కన నిలిపి ఉంచిన లారీని ఓ కారు బలంగా ఢీకొన్న ఘటనలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం పాల్వంచ–భద్రాచలం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల



మిగతా 2 లో...

## మావోయిస్టుల ఆయుధాలు స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి...)

మెదిలి పోలీస్ స్టేషన్ పరిధిలో గల కిర్రులి, కటువాపదర్ అటవీ ప్రాంతాల్లో ఈ ఆపరేషన్ చేపట్టారు.లోంగిపోయిన ఓ నక్సలైట్ అందించిన సమాచారంతో మల్కానగిరి డివిజన్, బీజాపూర్ భద్రతా బలగాల సంయుక్త బృందాలు మంగళవారం ఉదయం విస్తృతంగా గాలింపు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ వినోద్ పాటిల్ తెలిపారు. ఈ సందర్భంగా అడవిలో భూగర్భంలో రహస్యంగా దాచిన ఆయుధాలు, పేలుడు పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.స్వాధీనం చేసుకున్న సామగ్రిలో ఒక లైట్ మెషిన్ గన్ (ఎల్ఎంజీ), రెండు ఇన్సాస్ రైఫిళ్లు, రెండు టిఫిన్ బాంబులు, ఎనిమిది కిలోల శక్తివంతమైన పేలుడు పదార్థం, ఒక గ్రెనేడ్, ఏకే–47 మ్యాగజైన్, 18 ఎలక్ట్రిక్ డిటోనేటర్ వైర్లు, వైర్‌లెస్ రిమోట్ స్విచ్, వాకీ–టాకీ, సోలార్ ప్లేట్‌తో పాటు ఇతర నక్సల్ సామగ్రి ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఈ స్వాధీనంతో నక్సలైట్ల కుట్రలను భద్రతా బలగాలు మరోసారి భగ్నం చేశాయని అధికారులు పేర్కొన్నారు.

## అతి వేగం... ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి...)



సమీపంలో రోడ్డుపక్కన నిలిపి ఉంచిన లారీని భద్రాచలం వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైపోగా, కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్స్ ద్వారా సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన 4 ఏళ్ల చిన్నారి చికిత్స పొందుతూ మరణించింది. మిగతా వారి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అనంతరం పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాదానికి అతి వేగమే కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం కారణంగా కొంతసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

## రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్ర గాయాలు

- మానవత్వం చాటుకున్న సీఐ బత్తుల



**టేకులపల్లి,జూన్ 10,ప్రజాజ్యోతి:** కారేపల్లి మండలం రేలకాయలపల్లి పంచాయతీ రంగురాళ్లబోడు గ్రామానికి చెందిన రైతు మాలోతు రవి విత్తనాలు కొనుగోలు చేసేందుకు తన బైక్‌పై టేకులపల్లి మండలం సాయనపేట మీదుగా తొమ్మిదో మైలు తండా గ్రామానికి బయలుదేరారు. అదే సమయంలో ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇల్లందు నుంచి టేకులపల్లి వైపు తన కారులో వస్తున్నారు. తొమ్మిదో మైలు తండాలోని గులాయిగడ్డ సమీపంలో ఉన్న ఒక విత్తనాల దుకాణానికి వెళ్లే క్రమంలో, రైతు రవి తన బైక్‌ను ఒక్కసారిగా కుడి వైపునకు (రైట్ సైడ్) తిప్పారు. ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న ఎమ్మెల్యే కారు.. బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న రవి కింద పడిపోవడంతో ఆయనకుతీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాద తీవ్రతకు ఎమ్మెల్యే కారు ముందు భాగం కూడా స్వల్పంగా ధ్వంసమైంది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన టేకులపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) తీవ్రంగా గాయపడిన రైతు రవిని మానవత్వంతో తన సొంత కారులోనే ఎక్కించుకుని చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం క్షతగాత్రుడికి ఆసుపత్రిలోఅత్యవసర వైద్య సేవలు అందుతున్నాయి. ఈ రోడ్డు ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న టేకులపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ప్రమాదం జరిగిన తీరుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# గ్రామాల అభివృద్ధిలో ప్రజల సహకారం కీలకం





(మొదటి పేజీ తరువాయి...)

మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. గతంతో పోలిస్తే గ్రామాల్లో మౌలిక వసతులు గణనీయంగా మెరుగుపడ్డాయని, రహదారులు, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు వంటి వసతులు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలు గ్రామాల అభివృద్ధికి మరింత ఊతమిస్తున్నాయని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్న కలెక్టర్, రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాల మేరకు పంట మార్పిడి విధానాలను అనుసరిస్తూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వినియోగించాలని కోరారు. గత సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కలిగించిన పీఆర్–126 వరి రకాన్ని సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా మెరుగైన దిగుబడులు, అధిక ఆదాయం సాధించవచ్చని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీలు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీల శుభ్రత, నిల్వ నీటి తొలగింపు, ఆయిల్ బాల్స్ వినియోగం వంటి చర్యల ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహాలు మంజూరు చేయడం జరుగుతుందని, అర్హత కలిగిన వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి అర్హులైన ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రీ–ప్రైమరీ విద్యలో భాగంగా అన్నపురెడ్డిపల్లి మండలానికి మూడు ప్రీ–ప్రైమరీ పాఠశాలలు మంజూరైనట్లు తెలిపారు. పారదర్శకమైన ఓటరు జాబితా తయారీ కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇంటింటికి వచ్చే బూత్ స్థాయి అధికారులకు సరైన సమాచారం అందించి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం గ్రామ సభకు హాజరైన ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న కలెక్టర్, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీఓ ఎస్.వి. సత్యనారాయణ, ఎంపీఓ జె. గణేష్ గాంధీ, మండల వ్యవసాయాధికారి అనూష, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సాధారణ ప్రసవాలను పెంచి – మాతృ, శిశు మరణాలను తగ్గించాలి

(మొదటి పేజీ తరువాయి...)

జిల్లాలో నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్ లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణ, ప్రత్యేక ఆరోగ్య శిబిరాల ఏర్పాటు, శాంపిల్ సేకరణను వేగవంతంగా నిర్వహించడం, రోగులకు సరైన నిర్ధారణ చేసి తగిన చికిత్స అందించడంపై సూచనలు చేశారు. జిల్లాలో సాధారణ ప్రసవాల శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అవసరం లేని సిజేరియన్ ప్రసవాలను తగ్గించాలని సూచించారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా ఏ ఎన్ సి పరీక్షలు నిర్వహించి, హై రిస్క్ గర్భిణీల ప్రత్యేక ప్రొఫైల్‌ను నిర్వహించాలని, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో నిరంతర పరీక్షలు చేయించాలని తెలిపారు. అదేవిధంగా ఈ డి డి సక్రమంగా నిర్వహిస్తూ ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. గర్భిణీలలో రక్తహీనత (అనీమియా) గుర్తింపు, చికిత్సపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి గర్భిణికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. జిల్లాలో సికిల్ సెల్ అనీమియా అధికంగా ఉన్న ప్రాంతాల్లో గర్భిణీలకు తప్పనిసరిగా సికిల్ సెల్ అనీమియా స్క్రీనింగ్ నిర్వహించాలని ఆదేశించారు. మాతృ మరణాల రేటు, శిశు మరణాల రేటు తగ్గించేందుకు ప్రతి గర్భిణికి సమగ్ర ఆరోగ్య సేవలు అందించాలని తెలిపారు. గర్భిణీలు యోగా, తేలికపాటి వ్యాయామాలు చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండేలా ఆరోగ్య విద్య అందించాలని సూచించారు. ప్రసవానంతరం తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి తల్లికి అవగాహన కల్పించాలని, శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, తల్లి ,శిశు ఆరోగ్యానికి తల్లిపాలు అత్యంత ముఖ్యమని వివరించాలని సూచించారు. ప్రసూతి వార్డులు, లేబర్ రూమ్‌లలో అన్ని ప్రోటోకాల్స్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని, వార్డుల పరిశుభ్రత, నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు పాటిస్తూ, వ్యర్థాల వేరు వేరు నిర్వహణకు ప్రత్యేక బిన్లను వినియోగించాలని ఆదేశించారు. అదేవిధంగా ఓ పి, ఐ పి రిజిస్టర్లు , ఇతర రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి నిర్వహించాలని సూచించారు. పాము కాటు, కుక్క కాటు ఇతర జంతువుల కాటు బాధితులకు తక్షణ చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి కేంద్రంలో "నార్మల్ డెలివరీ మోటివేషన్" వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి, గర్భిణీ స్త్రీలకు ప్రతిరోజూ యోగా మరియు తేలికపాటి వ్యాయామాలపై అవగాహన కల్పించడం ద్వారా సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని నర్సింగ్ ఆఫీసర్లను ఆదేశించారు. సమతుల్య ఆహారం ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. రోజువారీ ఆహారంలో సుమారు 50 శాతం కార్బోహైడ్రేట్లు, ఫైబర్ , ఆరోగ్యకరమైన కొవ్వులు, 25 శాతం ప్రోటీన్లు, 25 శాతం పండ్లు, కూరగాయలు మరియు ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. సమతుల్య ఆహారం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. జిల్లాలో హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని, ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఆరోగ్య విద్య కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆరోగ్యకర జీవనశైలి, వ్యాయామం, పోషకాహారం ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సాయి కళ్యాణ్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు ప్రతాప్, రాందాస్, దినేష్, రాకేష్, హరీష్, జిల్లాలోని నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం

**టేకులపల్లి, జూన్10, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని ఆర్ సిపేట,ఎర్రాయిగూడెం, పెట్రాంచెలక గ్రామాల్లో లబ్ధిదారుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై ఇందిరమ్మ ఇళ్ళు లబ్ధిదారులతో కలిసి రిబ్బెన్ కట్ చేసి నూతన ఇళ్ళు ప్రారంభించారు. లబ్ధిదారి ఇంట్లో నేలపై కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొన్న ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ నాయకులు సేమ్యా తింటూ వారితో ముచ్చటించారు. లబ్ధిదారులను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు లక్కినేని శ్యామ్ , నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఖాదర్ బాబు , హౌసింగ్ ఏఈ గణేష్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి కాలేప్రసాద్, సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కబ్జాదారుల కోరల్లో చిరతనాల చెరువు..!

- 41 ఎకరాల జలవనరును మింగేసి 6 ఎకరాలకు కుదించిన వైనం.
- పామాయిల్ తోటలుగా మారిన చెరువు శిఖం భూములు.
- రాత్రివేళ జేసీబీలతో మట్టి నింపివేత.
- రాజకీయ అండదండలా..?
- అధికారుల నిర్లక్ష్యమా..?
- కబ్జాదారుల రౌడీయి జమా..?







**పాల్వంచ, జూన్ 10, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని పుల్లాయిగూడెం గ్రామంలో ఉన్న యానంబైల్ రెవిన్యూ పరిధిలో ఉన్నటువంటి ఉప్పలకుంట (చిరతనాల )చెరువు ఆక్రమణల బారి నపడి అస్తిత్వాన్ని కోల్పోతున్న దుస్థితి నెలకొంది. ఒకప్పుడు 41 ఎకరాల విస్తీర్ణంలో గ్రామానికి జీవనాడిగా నిలిచిన ఈ జలవనరు ప్రస్తుతం కేవలం 6 ఎకరాలకు మాత్రమే పరిమితమైందని గ్రామస్తులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు, భూగర్భ జలాల పెరుగుదలకు ఆధారంగా నిలవాల్సిన చెరువు భూములు క్రమంగా కబ్జాలకు గురై పామాయిల్ తోటలుగా మారిపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గ్రామస్తుల కథనం ప్రకారం చెరువు శిఖం భూములను కొందరు వ్యక్తులు దశలవారీగా ఆక్రమించుకుని మట్టి నింపి వ్యవసాయ భూములుగా మార్చుకున్నారు. ఇప్పటికే పలువురు ఆక్రమణదారులు పామాయిల్ సాగు చేస్తుండగా, వారిపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో మరింత మంది అదే బాట పట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. "వాళ్లు ఆక్రమించారు.. ఎవరూ అడగలేదు.. మరి మమ్మల్ని ఎవరు ఆపుతారు?" అన్న ధైర్యంతో చెరువు భూములపై యథేచ్ఛగా కబ్జాలు కొనసాగుతున్నాయని గ్రామస్తులు మండిపడుతున్నారు. తాజాగా మంగళవారం రాత్రి వేళల్లో జేసీబీల సహాయంతో చెరువు ప్రాంతంలో మట్టి నింపి భూమిని చదును చేసిన ఘటన తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి వస్తుందనే భయమో, అధికారుల కంటపడకుండా చేయాలనే ఉద్దేశమో తెలియదు గానీ రాత్రివేళ భారీ యంత్రాలతో పనులు నిర్వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రజా జలవనరులో బహిరంగంగా పనులు జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడం మరింత అనుమానాలకు కారణమవుతోంది. గ్రామస్తులను వేధించడంలో, చిన్న చిన్న భూ వివాదాల్లో వెంటనే స్పందించే అధికారులు చెరువు ఆక్రమణల విషయంలో మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఒకప్పుడు 41 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు ప్రస్తుతం 6 ఎకరాలకు కుదించబడిందంటే మిగిలిన 35 ఎకరాలు ఎక్కడికి వెళ్లాయని ప్రజలు నిలదీస్తున్నారు. ఇది ఒక్కరోజులో జరిగిన వ్యవహారం కాదని, ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఆక్రమణల ఫలితమేనని చెబుతున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో చెరువుగా నమోదైన భూమిని ఆక్రమించి పామాయిల్ తోటలు సాగు చేయడం, మట్టి నింపివేయడం, భూమిని చదును చేయడం వంటి పనులు జరుగుతున్నా చర్యలు లేకపోవడం వెనుక రాజకీయ అండదండలు ఉన్నాయా..? లేక కొందరి ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గుతున్నారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెరువులను పరిరక్షించాల్సిన బాధ్యత కలిగిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు ఇప్పటికైనా స్పందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. చెరువులు కేవలం నీటి నిల్వ కేంద్రాలు మాత్రమే కాదని, గ్రామీణ వ్యవసాయానికి జీవనాధారమని రైతులు గుర్తుచేస్తున్నారు. వర్షాకాలంలో నీటిని నిల్వచేసి భూగర్భ జలాలను పెంచే చెరువులు క్రమంగా ఆక్రమణలకు గురైతే రానున్న రోజుల్లో సాగునీరు, తాగునీటి సమస్యలు తీవ్రమవుతాయని హెచ్చరిస్తున్నారు. నేడు చెరువును కాపాడకపోతే రేపు గ్రామ భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిరతనాల చెరువు అసలు విస్తీర్ణం, శిఖం భూములను గుర్తిస్తూ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా సమగ్ర సర్వే నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. చెరువు భూములను ఆక్రమించి పామాయిల్ తోటలు సాగు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రాత్రివేళ మట్టి నింపివేతలకు పాల్పడిన వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని చర్యలు తీసుకోకపోతే "ఉప్పలకుంట (చిరతనాల )చెరువు" అనే పేరు మాత్రమే మిగిలి, చెరువు పూర్తిగా చరిత్రలో కలిసిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

## శ్యాంసుందర్ రెడ్డి సేవలో మరువలేం.

- సర్పంచ్ సీతారాములు



**గుండాల జూన్ 11. ప్రజా జ్యోతి** రెండు సంవత్సరాలుగా గుండాల గ్రామపంచాయతీలో పదవీ బాధ్యతలు నిర్వహించిన శ్యాంసుందర్ రెడ్డి సేవలు అమోఘమని గుండాల సర్పంచ్ కోరం సీతారాములు అన్నారు బుధవారం బదిలీపై వెళ్లిన కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డిని గ్రామపంచాయతీ కార్యాలయంలో సన్మానించారు ఈ సన్మాన సభను ఉద్దేశించి సర్పంచ్ కోరం సీతారాములు మాట్లాడుతూ గ్రామపంచాయతీ సమస్యలపై స్పందించి దగ్గరుండి పనిని పూర్తి చేసేవాడని, గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి పని చేసిన ఆయన సేవలను గ్రామ ప్రజలు మర్చిపోరన్నారు పారిశుద్ధ పనులను దగ్గరుండి చేసేవాడని, అభివృద్ధి కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు చర్చిస్తూ పని పూర్తి చేసే విధంగా చర్యలు తీసేవి తీసుకునే వాడని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బాలరాజు, మండల వైద్యాధికారి సుదీప్, ఏపీవో రవితేజ, గుండాల గ్రామపంచాయతీ కార్యదర్శి శివకృష్ణ, గ్రామస్తులు అబ్దుల్ నబీ, నరసింహారావు, ఆజాద్, కారోబర్ నాగరాజు వార్డు సభ్యులు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలో ఇసుక లొల్లి

- తాసిల్దార్ సంగీత చొరవతో సద్దుమణిగిన వివాదం.




**గుండాల. జూన్ 11 ప్రజా జ్యోతి.** ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక రవాణా జరగాలని గ్రామ సభలో ప్రజలు డిమాండ్ చేయగా తాసిల్దార్ బత్తిని సంగీత చొరవతో వివాదం సద్దుమణిగింది. బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి నివేదిక ... గ్రామసభ కోరం సీతారాములు అధ్యక్షతన జరిగింది గ్రామ సభలో వివిధ అంశాలపై విస్తృతంగా చర్చ జరిగినప్పటికీ ఇసుకపై ప్రజలు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు రెండు నెలలుగా ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇతర అవసరాల కోసం ఇసుక రాకుండా అధికారులు అడ్డుపడుతున్నారని ఆరోపిస్తూ చర్చకు దిగారు. ఇసుక రవాణా జరిగే విధంగా చూడాలని అధికారులను నిలదీయడంతో తాసిల్దార్ బత్తిని సంగీత చొరవ తీసుకొని ఇసుక విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది రోడ్డు భద్రతపై సీఐ శ్రీపతి తిరుపతి క్లుప్తంగా వివరించారు. వ్యవసాయ శాఖ ఏవో వెంకటరమణ వ్యవసాయ విత్తనాలు ఎరువులు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ భూ రిజిస్ట్రేషన్ ను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు వైద్యాధికారి సుదీప్ రానున్న వర్షాకాలదుషా జాగ్రత్తగా ఉండాలని నీళ్లు నిలువ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. మండల అభివృద్ధి అధికారి బాలరాజు గ్రామ సభల ఉద్దేశించి మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు వివిధ అంశాలపై చర్చించి వివరించారు ఈ కార్యక్రమం లో ఎస్సై శ్రావణ్ కుమార్, కార్యదర్శి శివకృష్ణ విద్యుత్ శాఖ అధికారి రమేష్ మండల అభివృద్ధి అధికారి తదితరులు పాల్గొన్నారు

## డివైడర్ ను ఢీకొన్న ఆటో.. డ్రైవర్ మృతి



**బూర్గంపహాడ్, జూన్ 10 (ప్రజాజ్యోతి):** డివైడర్ కు ఆటో ఢీకొనగా డ్రైవర్ మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని సారపాకలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సారపాక గాంధీనగర్ లో నివసిస్తున్న శివ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి సారపాక వారాంతపు సంత నిర్వహించే ప్రాంతం వద్దకు రాగానే ఆటో అదుపు తప్పి డివైడర్ ను ఢీకొట్టింది. కాగా ఆటో ఒక్కసారిగా పల్టీకొట్టడంతో డ్రైవర్ శివ కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యా యి. స్థానికులు, వాహనదారులు చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి శివను తరలించగా కొద్దిసేపటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్యానికి విఘాతం

- కాంగ్రెస్ లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్



**బూర్గంపహాడ్, జూన్ 10 (ప్రజా జ్యోతి ):** రాజ్యసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, ఏఐసీసీ సభ్యురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ ఖండించారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలో ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని, కేవలం సాంకేతిక లోపం పేరుతో అఫడవిట్లో కేసు ప్రస్తావన లేకపోవడాన్ని కారణంగా చూపి నామినేషన్ తిరస్కరించారని, ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థికి సవరణ చేసుకునే అవకాశం కల్పించాల్సి ఉండగా ఉద్దేశ్యపూర్వకంగా అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగాల్సిన అవసరం ఉందని, చిన్నపాటి సాంకేతిక కారణాలు చూపి నామినేషన్ తిరస్కరించడం దురదృష్టకరమని తెలంగాణ ప్రజల తరపున బలంగా మాట్లాడగల నాయకత్వాన్ని అడ్డుకునే ప్రయత్నాలు ప్రజలు సహించరని, ప్రజాస్వామ్య విలువలు కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సర్పంచ్ మండా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, యువజన కాంగ్రెస్ నాయకులు ఎడమకంటి సుధాకర్రెడ్డి, నిమ్మల హరీష్, దునుకు రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఐలాపురం బ్రిడ్జి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు యువకులు మృతి







**పినపాక, జూన్ 10(ప్రజాజ్యోతి)** పినపాక మండలం ఐలాపురం బ్రిడ్జి సమీపంలో బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు టిప్పర్ లారీని ఢీకొన్నారు . ఈ ప్రమాదం లో మణుగూరు సమీపంలోని కమలాపురం గ్రామానికి చెందిన దర్రాజు కిషోర్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డా డు. అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

## గ్రామ సభల్లో సామాజిక అంశాలపై విస్తృత అవగాహన



**ఆళ్ళపల్లి. జూన్10. (ప్రజాజ్యోతి )**రాయపాడు. పాతూరు గ్రామాలలో బుధవారం నిర్వహించిన గ్రామ సభల సందర్భంగా ప్రజలకు ముఖ్యమైన సామాజిక, భద్రతా అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం స్థానిక (ఎస్ఐ )సోమేశ్వర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులకురోడ్డు భద్రత ప్రాధాన్యత ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణాలను కాపాడుతుందని చెప్తూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ఘోర రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టాలు వాటి తీవ్ర పరిణామాల గురించి ప్రజలను హెచ్చరించారు.మాదకద్రవ్యాల నివారణ గంజాయి వంటి వ్యసనాల వల్ల కలిగే ఆరోగ్య నష్టాలను, అవి దారితీసే సామాజిక సమస్యలను వివరించారు.సైబర్ నేరాలపై జాగ్రత్తలు.ఆన్‌లైన్ మోసాలు, సైబర్ ముప్పుల గురించి వివరిస్తూ.. వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఎలా సురక్షితంగా ఉంచుకోవాలో తెలియజేశారు. ఈ సదస్సుకు గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్నివిజయవంతం చేశారు.

## మచ్చా కన్నయ్య సేవలు చిరస్మరణీయం



**చర్ల, జూన్ 10:(ప్రజాజ్యోతి ):**కమ్యూనిస్టు ఉద్యమం అనేది కష్టజీవుల హక్కుల కోసం, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగుతున్న నిరంతర పోరాటమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. చర్లలో బుధవారం నిర్వహించిన మచ్చా కన్నయ్య సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో అసమానతలు, కుల వివక్ష, దోపిడీ పెచ్చరిల్లిన కాలంలో ప్రజల పక్షాన నిలబడే నాయకులను తీర్చిదిద్దడంలో మచ్చా కన్నయ్య వంటి వ్యక్తుల పాత్ర ఎంతో గొప్పదని ఆయన పేర్కొన్నారు. తన కుమారుడు మచ్చా వెంకటేశ్వర్లు ప్రజా ఉద్యమాల వైపు అడుగులు వేస్తున్న సమయంలో కన్నయ్య ప్రోత్సహించి, సమాజ సేవకు అంకితమయ్యేలా మార్గనిర్దేశం చేశారని తెలిపారు.సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారి రవికుమార్ మాట్లాడుతూ, 1997లో డీవైఎఫ్ఐ చర్ల మండల కార్యదర్శిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన మచ్చా వెంకటేశ్వర్లు అనేక ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించి పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారని చెప్పారు. వాజేడు ప్రాంతంలో భూ పోరాటాలు, ప్రజా ఉద్యమాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా చిన్న వయసులోనే పలు కీలక బాధ్యతలు నిర్వహించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు.మరో రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ, కన్నయ్య పార్థివ దేహాన్ని కొత్తగూడెం మెడికల్ కళాశాలకు దానం చేయడం ద్వారా మచ్చా కుటుంబం సమాజానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. దేహదానం ద్వారా వైద్య విద్యార్థులకు ఉపయోగపడేలా చేసిన సేవ ప్రశంసనీయమని పేర్కొన్నారు.మచ్చా వెంకటేశ్వర్లు రాజకీయ గురువు చింతూరి వెంకట్రావు మాట్లాడుతూ, సమాజంలోని అన్యాయాలను ఎదుర్కొనే ధైర్యం, నిబద్ధత కమ్యూనిస్టు కార్యకర్తల ప్రధాన లక్షణాలని అన్నారు. కన్నయ్య ప్రోత్సాహంతోనే మచ్చా వెంకటేశ్వర్లు ప్రజా ఉద్యమాల్లోకి వచ్చి ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మిడియం బాబూరావు, అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, కొక్కెర పుల్లయ్య, జ్యోతి, కారం పుల్లయ్య, బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాస్, నర్సారెడ్డి, ఏజే రమేష్, లక్ష్మి, గడ్డం స్వామి, కొమరం కాంతారావు, రాములు, మచ్చా రామారావు, బందెల చంటి, పొడుపుకంటి సమ్మక్క, దొడ్డి హరినాగవర్మ, పామారు బాలాజీ, వరదాల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం ఏరియా ఆసుపత్రిని ముఖ్యమంత్రి స్వయంగా సందర్శించాలి

- ఏజెన్సీ ప్రాంత వైద్యంపై ప్రభుత్వం చిన్న చూపు
- ప్రభుత్వ వైద్య నిర్లక్ష్యంపై ఆగస్టులో హైదరాబాదులో భారీ బహిరంగ సభ
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**భద్రాచలం టౌన్, జూన్ 10, ప్రజాజ్యోతి**

భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సందర్శించి ఇక్కడ అందుతున్నవైద్యాన్ని చూడాలని సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం బృందం ప్రభుత్వ ఏరియా వైద్యశాలని సందర్శించారు. పలువురు రోగులతో మాట్లాడిన జాన్ వెస్లీ వారికి అందుతున్న వైద్యంపై ఆరాతీశారు. అనంతరం ఏరియా ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడిన జాన్ వెస్లీ ఏజెన్సీ వైద్యంపై ప్రభుత్వం చిన్నచూపు చూపిస్తోందని ఆరోపించారు. నాలుగు రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న భద్రాచలం ఆసుపత్రికి ప్రతిరోజు 400 నుండి 600 వరకు రోగులు వస్తున్నారని, ఆ స్థాయిలో రోగులుస్తున్న ఆసుపత్రికి కేవలం 19 మంది వైద్యులే ఉండటం శోచనీయమన్నారు. 55 మంది నర్సింగ్ సిబ్బందికి కేవలం 15 మంది మాత్రమే ఉన్నారని అన్నారు. సగానికి పైగా ఖాళీలు ఉంటే వాటిని పూరించాల్సిన పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది లేక పేద వాడికి ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షాల మిగిలిపోతుందని జాన్ వెస్లీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య పనులు నిర్వహించే శానిటేషన్ కార్మికులకు సైతం చాలీచాలని వేతనాలు సకాలంలో అందటం లేదని అన్నారు. జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సందర్శించిన పాపాన్నిపోలేదని జాన్ వెస్లీ విమర్శించారు. సిపిఐ ఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్యం పై అధ్యయనం చేస్తున్నామని ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యలపై ఆగస్టు మాసంలో హైదరాబాదులో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రత్యేకించి భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సిబ్బంది కొరతపై త్వరలోనే సిపిఐ ఎం బృందం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు సున్నం గంగా పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు డి సీతాలక్ష్మి సంతోష్ 20వ వార్డు నెంబర్ ఇరుప అనసూర్య పట్టణ నాయకులు నాదెల లీలావతి కొలగాని రమేష్ దొనకొండ రాఘవయ్య కనక శ్రీ చట్ట శ్రీనివాసరావు కోరాడ శ్రీను సంద్ర ఉపేంద్ర కుంజా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక రవాణా పై స్పష్టత ఇవ్వండి

- గ్రామ సభలో తాసిల్దార్, ఎంపీడీవో ను అడిగిన స్థానిక కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి



**పినపాక,జూన్ 10(ప్రజాజ్యోతి)** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక రవాణా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక మంజూరు చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి తాసిల్దార్, ఎంపీడీవోను కోరారు. పినపాక మండలం ఈ బయ్యారంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రాబోయేది వర్షాకాలం అని బురద తగ్గించడానికి అక్కడక్కడ ఇసుక సైతం పోయాల్సి ఉంటుందని గ్రామ అవసరాల కోసమైనా ఇసుకకు పర్మిషన్ ఇవ్వాలని కోరారు. స్పందించిన తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ సంకీర్త్, ఎంపీ ఓ శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ కు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సమస్యను తెలియజేశామని త్వరలోనే జిల్లా కలెక్టర్ నిర్ణయానుసారం పర్మిషన్ ఇస్తామని తెలిపారు. ఇసుక ఎంత అవసరమో అధికారులతో ఇప్పటికే నివేదికలు తెచ్చుకున్నామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

## ఆరిఫా, రోషిని వృద్ధాశ్రమంలో ఘనంగా దోసపాటి జన్మదిన వేడుకలు

- అనంతరం వృద్ధులకు పాలు పండ్లు,స్వీట్స్ అందజేశారు

**అశ్వాపురం జూన్ 10, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండల కేంద్రం మంచికంటినగర్ లో గల ఆరిఫా రోషిని వృద్ధాశ్రమంలో దోసపాటి పిచ్చేశ్వరరావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వృద్ధాశ్రయంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం మానవత్వాన్ని చాటుకునే గొప్ప కార్యక్రమం అని జన్మదిన కార్యక్రమ అనేవి వృద్ధులకు సంతోషాన్ని మనోధైర్యాన్ని ఇచ్చే కార్యక్రమం అన్నారు. నా కుటుంబ సభ్యులతో పాటు మీ అందరి మధ్యలో నా జన్మదిన వేడుకలు జరుపుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధులు ఒకరు మాట్లాడుతూ సమాజానికి ఎంతో మేలు చేసిన మీ ముఖంలో చిరునవ్వు చూడడం మీరు మీ జన్మదిన వేడుకలు మా మధ్యలో జరుపుకోవడం మాకెంతో సంతోషంగా ఉంది అన్నారు. అనంతరం ఇందులో భాగంగా మొదట కేక్ కటింగ్ చేసి వారికి శుభాకాంక్షలు తెలియచేసిన అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పాలు, పండ్లు, బ్రెడ్, స్వీట్స్ యాదవ సంఘం నాయకులు నక్కన బోయిన పాపారావు చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా వృద్ధులు దోసపాటి పిచ్చేశ్వరరావు రావు ని ఆశీర్వదిస్తూ... నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, జీవించాలని భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి ఆశీస్సులు నిండుగా ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమంలో... గద్దల నాగేశ్వరరావు, ఇసంపల్లి కృష్ణమాదిగ, చుంచు రామ్మూర్తి, గద్దల రామకృష్ణ, కొమ్ము రాంబాబు షేక్ నయీమ్, ఇల్లుటూరి మహేష్, ఎండి కరీం, నరేష్, మురికిపూడి అశోక్ వృద్ధాశ్రమం నిర్వాహకులు షేక్ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.9.90 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- ఐదుగురు వ్యక్తుల అరెస్టు

**భద్రాచలం టౌన్, జూన్ 10 , ప్రజాజ్యోతి** భద్రాచలంలో బుధవారం స్థానిక కూనవరం రోడ్డులో ఎక్సైజు ఎన్ ఫోర్సుమెంటు అధికారులు వాహన తనిఖీలు చేసిన సమయంలో మూడు ద్విచక్రవాహనాలను తనిఖీ చేయగా రూ.9.90 లక్షలు విలువ చేసే 13.600 కిలోల గంజాయిని పట్టుకోవడంతో పాటు ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజు ఎన్ ఫోర్సుమెంటు ఎస్సై సీహెచ్ శ్రీహరిరావు తెలిపారు. ఉదయం కూనవరం రోడ్డులోని ఇసుక రీచ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఒక ద్విచక్ర వాహనంను ఆపి తనిఖీ చేయగా 8.800 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. ఈ గంజాయిని తరలిస్తున్న కర్నూలు జిల్లా మునగాలపాడుకు చెందిన షేక్ అజ్మతుల్లా, గంగాధర్ హాన్ లను అరెస్టు చేసారు. అలాగే మరో ద్విచక్ర వాహనంలో 2.200 కిలోల ఎండు గంజాయి లభ్యమవగా నల్గొండ జిల్లా పానగల్లుకు చెందిన కోడదల అజయ్ కుమార్, నల్గొండ జిల్లా బొంకూరు



లోకేష్ ను అరెస్టు చేసారు. అలాగే మూడో వాహనంలో 3.100 కిలోల గంజాయి లభ్యం కాగా ఒడిశాలోని మల్కనగిరికి చెందిన నిమాచంద్ అధికారిని అరెస్టు చేశారు. ఈ మూడు వాహనాల్లో ఉన్న గంజాయిని ఒడిశాలోని మల్కనగిరి జిల్లా నుంచి హైదరాబాద్ కు తరలిస్తూ పట్టుబడ్డారు. పట్టుబడిన గంజాయి మొత్తం 13.600 కిలోలు ఉండగా, గంజాయి మార్కెట్ ధర రూ.9.90 లక్షలు ఉంటుందని ఎక్సైజు అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్స్ పి. రాజు, రమేశ్ బాబు, వెంకన్న, ప్రసన్నకుమార్, ఉపేందర్ లు పాల్గొన్నారు.

# గ్రామ సభలో పాల్గొన్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య





**టేకుల ప ల్లి, జూన్1 0 , ప్రజాజ్యోతి:** 99రోజుల ప్రజా–పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం ఆర్సి పేట గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ అనేది పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం మరియు పరిశుభ్రత కోసం అత్యంత ముఖ్యమైన అంశమని, పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలు మరియు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను ప్రతి పౌరుడు తప్పనిసరిగా పాటించాలి. చెత్తను సక్రమంగా నిర్వహిద్దాం,పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే భావనతో అందరూ ముందుకు రావాలన్నారు ఆయన పిలుపుఇచ్చారు.పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బోడు ఎస్ ఐ (సబ్ ఇన్స్పెక్టర్) శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కనిపిస్తూ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుంచే రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించాలి అని అన్నారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు,ప్రతి పౌరుడి బాధ్యత కూడా మనం నియమాలను పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించి సురక్షిత సమాజాన్ని నిర్మించగలమణి ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు హాజరై వారి శాఖలపై పూర్తి వివరాలను ఎమ్మెల్యే సమక్షంలో ప్రజలకు ఈ వేదికగా తెలియచేసారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో రైతులకి పెద్ద పీట వేస్తుందని, అనేక సంక్షేమ పథకాలను ప్రజల కోసం అమలు చేస్తూ, ముఖ్యంగా మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు లక్కినేని శ్యామ్ , నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఖాదర్ బాబు , జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్,ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్,సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీ పాలన ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచింది

- మోదీ 4399 రోజుల చారిత్రాత్మక పాలనకు గుర్తుగా భద్రాచలంలో ప్రత్యేక పూజలు
- జిల్లా బీజేపీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**భద్రాచలం టౌన్ , జూన్ 10 , ప్రజాజ్యోతి ,** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వరుసగా 4399 రోజులపాటు దేశానికి నాయకత్వం వహిస్తూ భారత రాజకీయ చరిత్రలో అత్యంత సుదీర్ఘకాలం నిరంతరాయంగా సేవలందించిన ఎన్నికైన ప్రధానమంత్రిగా చారిత్రాత్మక మైలురాయిని అధిగమించిన సందర్భంగా బుధవారం భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో బీజేపీ ఆద్వర్యంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠ మరింత పెరగాలని ఆకాంక్షిస్తూ నాయకులు స్వామివారిని దర్శించుకొని ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్ లక్ష్యంతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా 80 కోట్ల మందికి పైగా ప్రజలకు ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ, 4 కోట్లకు పైగా పక్కా ఇళ్ల నిర్మాణం, 15 కోట్లకు పైగా ఇంటింటికీ తాగునీటి కనెక్షన్లు, 10 కోట్లకు పైగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, 55 కోట్లకు పైగా జనధన్ బ్యాంకు ఖాతాలు అందజేశారన్నారు. అలాగే 11 కోట్లకు పైగా మరుగుదొడ్ల నిర్మాణం, 14 కోట్లకు పైగా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు, 11 కోట్ల మంది రైతులకు పీఎం కిసాన్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం వంటి కార్యక్రమాలు సామాన్య ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాయని తెలిపారు. అలాగే భారతదేశం ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం, డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచానికి ఆదర్శంగా నిలవడం, జీ–20 అధ్యక్షతను విజయవంతంగా నిర్వహించడం, చంద్రయాన్–3 విజయంతో చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగుపెట్టిన తొలి దేశంగా నిలవడం, రికార్డు స్థాయిలో జాతీయ రహదారులు, రైల్వేలు, ఎక్స్ ప్రెస్ వేలు నిర్మించడం మోదీ నాయకత్వ సామర్థ్యానికి నిదర్శనాలని పేర్కొన్నారు. అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం, జమ్మూ కాశ్మీర్ లో ఆర్టికల్ 370 రద్దు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం, గిరిజన మహిళ శ్రీమతి ద్రౌపది ముర్ము గారిని రాష్ట్రపతిగా ఎన్నుకోవడం, గిరిజన సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం కల్పించడం వంటి ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు మోదీ నాయకత్వంలో అమలయ్యాయని తెలిపారు. ప్రపంచ దేశాల మధ్య భారతదేశ ప్రతిష్ఠను మరింత పెంచుతూ, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్య సాధన దిశగా మోదీ గారు కృషి చేస్తున్నారని, ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి మరింత కాలం దేశానికి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు కుంజా ధర్మా, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్, బీజేపీ సీనియర్ నాయకులు కురిచేటి రామచంద్రమూర్తి, జిల్లా కౌన్సిల్ సభ్యులు నిడదవోలు నాగబాబు, జిల్లా సీనియర్ నాయకులు ములిశెట్టి రాంమోహన్ రావు, బోడ సత్యనారాయణ, చెల్లుబోయిన వెంకన్న, ముత్యాల చంద్రశేఖర్, పీసీ కేశవ్, దేవరపల్లి వెంకటేశ్వర్లు, అల్లాడి వెంకట సుబ్బయ్య, జీవా తదితరులు పాల్గొన్నారు.

# పెద్దన్నపై తమ్ముళ్ల ఘాతుకం..

- ఆస్తి కోసం అన్నదమ్ముల మధ్య చిచ్చు
- ప్రాణభయంలో దంపతులు భయాందోళన

**టేకులపల్లి,జూన్10,ప్రజాజ్యోతి :** తల్లిదండ్రుల మరణం తర్వాత ఆప్యాయంగా ఉండాల్సిన అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. టేకులపల్లి మండలం దాస్ తండా పంచాయతీ పరిధిలోని రేగులతండా గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.గ్రామానికి చెందిన తేజావత్ కిషన్,మాజీ అనే దంపతులకు మోహన్, శోభన్, సుమన్ అనే ముగ్గురు కుమారులకు జన్మనిచ్చారు. 2021లో తల్లి, 2025లో తండ్రి మరణించడంతో కుటుంబ ఆస్తుల పంపకాల అంశం తెరపైకి వచ్చింది.తల్లి దండ్రులు వదిలి వెళ్లిన భూములు, బంగారం తదితర ఆస్తులను సమానంగా పంచుకోవాలని పెద్దన్న మోహన్ సూచించగా, ఆ విషయం వివాదానికి కారణమైందని బాధితులు ఆరోపిస్తున్నారు.ఈ క్రమంలో గ్రామానికి చెందిన నెహ్రూ అనే వ్యక్తి జోక్యంతో తమ్ముళ్లు శోభన్, సుమన్‌లతో కలిసి మోహన్ కుటుంబంపై కక్ష పెంచుకున్నారని తెలుస్తోంది. గత ఏప్రిల్ 14న తమకు ప్రాణహాని ఉందంటూ మోహన్,అతని భార్య మీనాక్షి టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పరిస్థితి మారలేదని వారు చెబుతున్నారు.ఇటీవల వివాదాస్పద వ్యవసాయ భూమిని దున్నేందుకు శోభన్, సుమన్ సిద్ధమవగా,తమ వాటా ఇవ్వకముందు పనులు చేయవద్దని మోహన్ దంపతులు అడ్డుకున్నట్లు సమాచారం.దీంతో అక్కడ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని, ఆగ్రహంతో తమ్ముళ్లు ట్రాక్టర్‌ను వారిపైకి దూసుకెళ్లడంతో పాటు కర్రలతో దాడి చేశారని బాధిత దంపతులు ఆరోపించారు. ఈ ఘటనలో మోహన్ చేతిలో ఎముక విరిగినది,నా భార్య మీనాక్షికి బలమైన గాయాలయ్యాయి.ఈ ఘటనపై మే 30న బాధితులు మరోసారి పోలీసులను ఆశ్రయించగా, విచారణ అనంతరం జూన్ 8న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ప్రధాన నిందితులైన శోభన్, సుమన్‌లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, వారు మరుసటి రోజే బెయిల్‌పై విడుదలయ్యారు.అయితే బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత కూడా తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని మోహన్ దంపతులు ఆరోపిస్తున్నారు. కేసులు పెట్టి జైలుకు పంపిస్తారా.. మీ అంతు చూస్తాం.. మీకు ఆస్తిలో ఒక్క పైసా కూడా రానివ్వం" అంటూ బహిరంగంగా హెచ్చరిస్తున్నారని తెలిపారు. అలాగే నెహ్రూ, అతని కుమారుడు కూడా నీ ప్రాణాలు తీసేస్తామంటూ బెదిరింపులు చేస్తున్నారు అని ఆరోపిస్తున్నారు.తమ్ముళ్ల నుంచే ప్రాణహాని పొంచి




ఉందన్న భయంతో జీవిస్తున్నామని, తమకు పోలీసు రక్షణ కల్పించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మోహన్, మీనాక్షి దంపతులు పోలీసు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# మర్కోడులో ఘనంగా ప్రజా పాలన ప్రగతి గ్రామసభ



**ఆళ్ళపల్లి. జూన్10. (ప్రజా జ్యోతి )**మండల పరిధిలోని మర్కోడు గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం గ్రామసభను నిర్వహించారు. సర్పంచ్ సుతారి రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తహసీల్దార్ ఉషారాణి సహా వివిధ శాఖల అధికారులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.గ్రామ సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన మరియు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై అధికారులు, ప్రజాప్రతినిధులు చేర్చిచారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, ఉప సర్పంచ్ వగలబోయిన సతీష్, వార్డు సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారి (ఏఓ) రాజకుమార్, విద్యుత్ శాఖ (ఏఈ) జగదీష్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోరం



**టేకులపల్లి,జూన్10,ప్రజాజ్యోతి :** రైతు సంక్షేమమే ధ్యేయంగా ముం దుకు సాగుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.బుధవారం వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, రైతులకు అండగా ఉండేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్, బేతంపూడి ఆధ్వర్యంలో బుధవారం రైతులకు సబ్సిడీపై జీలుగు, జనుములు విత్తనాలను ఎమ్మెల్యే కోరం కనకయ్య పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ ఉత్పాదకత పెంపుదల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. రైతు కుటుంబాల అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధికి బాట అని పేర్కొంటూ, రైతుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తమ వంతు కృషి ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు మండల ఏవో అన్నపూర్ణ, ఏ ఈ ఓ లు , పిఎసిఎస్ సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు, వైస్ చైర్మన్ కే.శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ బోడా మంగీలాల్ నాయక్, సీఈఓ ప్రేమ్ చారి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లక్కినేని శ్యామ్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్,టేకులపల్లి సర్పంచ్ బోడా బాలునాయక్, పలు గ్రామపంచాయతీ సర్పంచులు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్నీనో ను గమనిస్తూ రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సాధించాలి

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబురావు

**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 10,(ప్రజా జ్యోతి)** ఎల్‌నినో ప్రభావాన్ని గమనిస్తూ రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సాధించాలని వ్యవసాయ శాఖ అధికారి బాబురావు రైతులకు సూచించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం లేదా వర్షాలలో అంతరాలు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ పంటల ఎంపికచేసుకోవాలనకోరారు, భూమిలో తగినంత తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే విత్తనాలు విత్తాలని, తేమ లేకుండా విత్తనాలు వేయడం వల్ల మొలక శాతం తగ్గి రైతులకు నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. వర్షాల ఆలస్యం లేదా తక్కువ వర్షపాతం పరిస్థితులు కొనసాగితే రైతు లు తక్కువ కాలవ్యవధిలో పూర్తయ్యే, తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటలైన కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ, కొర్రలు, సామలు వంటి పంటల సాగును పరిశీలించాలని సూచించారు.ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే వినియోగించాలని, విత్తన శుద్ధి చేపట్టాలని, పొలాల్లో తేమ సంరక్షణ చర్యలు పాటించాలని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రాలు ,వాతావరణ శాఖ సూచనలను అనుసరిస్తూ పం టల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు .

## కౌన్సిలర్ వస్తేనే సభ నిర్వహించాలని వార్డు ప్రజల డిమాండ్




**ఇల్లందు, జూన్ 10 (ప్రజా జ్యోతి)**పట్టణంలోని 23వ వార్డులో బుధవారం జరిగిన గ్రామసభను రెండోసారి స్థానిక ప్రజలు బహిష్కరించారు. వార్డు అధికారి నాగేశ్వరరావు అధ్యక్షతన వార్డు సభను నిర్వహించగా అక్కడికి చేరుకున్న ప్రజలు తాము వార్డు సభను బహిష్కరిస్తున్నామని సిపిఐ నాయకులు, వార్డు ప్రజలు దాసరి రాజారావు, సాయి రాజేశ్వరరావు, బండారి బిక్షపతి, కటకం రాజారాం, రాజు తదితరులు వారికి తెలియజేశారు. ఎన్నికలలో గెలుపొందిన నాటి నుంచి నేటి వరకు ఒక్కరోజు కూడా ఈ వార్డు కౌన్సిలర్ కొండపల్లి సరిత కనిపించలేదని వార్డు కౌన్సిలర్ లేనప్పుడు వార్డు సభ ఎలా నిర్వహిస్తారని వారిని ప్రశ్నించారు. గెలిచినప్పటి నుండి నేటి వరకు అనేక కారణాలను చూపుతూ ముఖం చాటిస్తున్నారని కేవలం తన పదవిని కాపాడుకోవడానికి మూడు నెలలకు ఒకసారి మున్సిపల్ కార్యాలయంలో జరిగే సమావేశానికి వచ్చి వెళ్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు చైర్మన్ పదవి దక్కలేదన్న ఉద్దేశంతో వార్డుకి రావడం లేదని ఆరోపించారు. చైర్మన్ పదవి కావాలనుకున్నప్పుడు కౌన్సిలర్ గా ఎందుకు కొనసాగాలని తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనికి తోడు ప్రతిసారి ఏ ప్రభుత్వ కార్యక్రమాలు జరిగిన సమావేశం జరిగిన వార్డు నడిబొడ్డున నిర్వహించే 24 సెంటర్ ను కాదని చెప్పి రాజకీయ దురుద్దేశంతో ఇక్కడ ప్రజలు కౌన్సిలర్ తీరుపై తిరుగుబాటు చేస్తారని ఉద్దేశంతో సభాస్థలిని వేరే ప్రాంతానికి మార్చారని మండిపడ్డారు. నాడు సరితను గెలిపిస్తే అనేక అభివృద్ధి పనులు చేపిస్తామని ఆమె చైర్మన్ గా ఎన్నికవుతుందని మాయమాటలు చెప్పిన ఆమె వెంట తిరిగిన నాయకులు ఇప్పుడు సమాధానం చెప్పాలంటూ నిలదీయడంతో అక్కడికి చేరుకున్న దండ సోమ నరసయ్య, మాజీ వార్డు కౌన్సిలర్ కుమార్ రవీందర్ తదితరులు ఆమె వచ్చినా రాకపోయినా మేము వార్డు ఇంచార్జ్ లుగా వ్యవహరిస్తూ పనులు చేపిస్తామనడంతో ఇరువురు మధ్య తీవ్రవాదం చోటుచేసుకుంది. అసలు మీరు ఎవరు కౌన్సిలర్ గా వ్యవహరించడానికి ఎవరు అంటూ నిలదీశారు. తామే వార్డుకి ఇంచార్జ్ కౌన్సిలర్లమని, తాము చెప్పిందే ఇక్కడ మున్సిపల్ అధికారులు నేను చెప్పిన పని చేస్తారంటూ కొందరు వ్యక్తులు 23వ వార్డులో తిరుగుతూ చెప్పుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై కమిషనర్ తక్షణమే స్పందించి ఇలాంటి ఇంచార్జ్ వ్యవస్థ రాష్ట్రంలో ఎక్కడైనా ఉందేమో అధికారికంగా చూపించాలని డిమాండ్ చేశారు. ఎవరు ప్రశ్నిస్తే వారి సంబంధించి ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు ఇతర ప్రభుత్వ పథకాలు రాకుండా చేస్తామని కొందరు వ్యక్తులు బహిరంగంగా వెల్లడిస్తున్నారని దీనిపై ప్రత్యక్ష ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 23వ వార్డు కౌన్సిలర్ వార్డుకు వస్తుందా రాదా కేవలం సభలకే పరిమితం అవుతుందా తేల్చి చెప్పాలని దీనిపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ రాష్ట్ర అధికారులను మున్సిపల్ శాఖ మంత్రిని కలిసి వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. వార్డుల్లో నెలకొన్న సానిటేషన్, వీధిలైట్లు, మంచినీటి సరఫరా అంతరాయం సంబంధించిన సమస్యలేవైనా ఉంటే వార్డులో కౌన్సిలర్ కు మద్దతుగా నిలిచిన వ్యక్తుల ఇంటిముందు ఆందోళన ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.



- గిరిజన కుటుంబ గడప వద్ద అర్ధరాత్రి అరాచకం
- ఒక్క వాయిదా ఆలస్యమైతే ఇంత దౌర్జన్యమా..?
- బాధితుల గౌరవానికి భంగం కలిగితే బాధ్యత ఎవరిది..?
- గిరిజన గ్రామాల్లో ఇలాంటి వసూళ్ల పద్ధతులకు ఎవరు అనుమతి ఇచ్చారు..?
- జిల్లా యంత్రాంగం ఇలాంటి ఘటనలపై ప్రత్యేక విచారణ చేపడుతుందా..?
- ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం
- రుణ వసూళ్ల పేరుతో మానవ హక్కులకు తూట్లు..?

# రాత్రి రెక్కలు విప్పిన ... ఫైనాన్స్ రౌడీయిజం..!

**రుణాలు ఇచ్చే సంస్థలా..? లేక ప్రజలను భయ భ్రాంతులకు గురిచేసే ప్రైవేట్ సేనలా..? అనే ప్రశ్నలు తలెత్తేలా లక్ష్మీదేవిపల్లి మండలం సాటి వారిగూడెం గ్రామంలో చోటుచేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీ కు చెందిన సిబ్బంది రాత్రి వేళ గిరిజన కుటుంబం ఇంటి వద్దకు వెళ్లి హడావుడి చేయడం కుటుంబ సభ్యులను మానసిక ఒత్తిడికి గురిచేయడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పటికే చీకట్లు కమ్ముకున్న సమయంలో గిరిజన గ్రామంలో ఇంటి వద్దకు వెళ్లి గొడవకు దిగడం కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేయడం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.**

- కొత్తగూడెం, ప్రజాజ్యోతి

గిరిజన బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తగూడెం ఓల్డ్ డిపో ప్రాంతం మొర్రేడు వాగు బ్రిడ్జి సమీపంలో గల ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగులు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ మరియు మరొకరు కలసి ప్రవేట్ ఫైనాన్స్ నిబంధనలు ఉల్లంగించి రాత్రి సమయం దాటిన తర్వాత సుమారు 7.25 గంటలకు గిరిజన గ్రామానికి చేరుకుని బాధితుల ఇంటి వద్దకు వెళ్లి ఫైనాన్స్ చెల్లింపుల విషయమై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.

### ♦ నెలల తరబడి బకాయిలు కాదు... కేవలం కొన్ని రోజుల ఆలస్యం మాత్రమే..!

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే బాధిత కుటుంబం నెలల తరబడి బకాయిలు పెట్టలేదని కేవలం ఒక వాయిదా చెల్లింపులో కొద్ది రోజుల ఆలస్యం మాత్రమే జరిగిందని తెలుస్తోంది. ఒక్క నెల కూడా పూర్తిగా పెండింగ్‌లో లేకపోయినా కేవలం వారం రోజుల ఆలస్యాన్ని కారణంగా చూపుతూ రాత్రి వేళల్లో ఇంటి వద్దకు వెళ్లి ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సాధారణంగా రుణ వసూళ్ల ప్రక్రియలో వినియోగదారుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత సంస్థలపై ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది వసూళ్ల పేరుతో కుటుంబ సభ్యుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

### ♦ యువతి అత్తగారి ఇంటికీ వెళ్లి హడావుడి..?

బాధితుల కథనం ప్రకారం రుణం తీసుకున్న ఇల్లు అల్లుడు పేరు మీద ఉండటంతో రుణం తీసుకున్న ఇంటి వద్ద కాకుండా యువతి అత్తగారి ఇంటి వద్దకూ వెళ్లి ప్రశ్నలు అడగడం ఒత్తిడి తేవడం జరిగిందని చెబుతున్నారు. రుణగ్రహీత వ్యక్తిగత విషయాలను ఇతరుల ముందు ప్రస్తావించడం, కుటుంబ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలకు పాల్పడటం ఎంతవరకు సముచితమో అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రుణం తన తల్లి ప్రతి నెల కడుతున్నప్పటికీ సుమారు నాలుగు రోజుల సమయం దాటిందనే కారణంతో అల్లుడు ఇంటి ముందు హడావుడి చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫైనాన్స్ సిబ్బంది ఓపిక లేకుండా గత రెండు రోజుల నుండి బాధిత కుటుంబాన్ని ఒత్తిడికి గురిచేస్తూ వ్యవహరించడం వల్ల యువతి అత్తింట్లో పరువు పోయి మానసికంగా తీవ్ర ఆవేదనకు గురైనట్లు కన్నీరుమున్నీరుగా వాపోయింది. ఒక వారంలో ఫైనాన్స్ చెల్లిస్తామని చెప్పినప్పటికీ బాధితుల మాటలను లెక్కచేయకుండా రాత్రి సమయంలో కూడా వారి పరువు తీసే విధంగా ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది వ్యవహరించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

### ♦ గిరిజన గ్రామాలనే లక్ష్యంగా చేసుకుంటున్నారా..?

గిరిజన ప్రాంతాల్లో చట్టాలపై పూర్తి అవగాహన లేని కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని కొందరు ఫైనాన్స్ సిబ్బంది ఒత్తిడి వ్యూహాలు అమలు చేస్తున్నారనే ఆరోపణలు గతంలోనూ వినిపించాయి. ఇప్పుడు సాటివారిగూడెంలో జరిగిన ఘటన ఆ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోందని గ్రామస్తులు అంటున్నారు. వారం రోజుల ఆలస్యం జరిగినా ఇంటి వద్దకు వచ్చి ఇలా వ్యవహరిస్తే నెలల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు అని గ్రామానికి చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ♦ వసూళ్ల పేరుతో మానసిక వేధింపులా..?

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలపై అనుచిత ఒత్తిడి తీసుకురావడం వల్ల తీవ్ర మానసిక ప్రభావాలు పడే అవకాశం ఉందని సామాజిక వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ప్రజల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం కుటుంబాల మధ్య అవమానకర పరిస్థితులు సృష్టించడం వల్ల తీవ్ర పరిణామాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని చెబుతున్నారు. రుణం వసూలు చేయడం సంస్థ హక్కు అయితే వినియోగదారుని గౌరవాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

### ♦ జిల్లా యంత్రాంగం స్పందించాల్సిన సమయం ఆసన్నం

ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల కార్యకలాపాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వసూళ్ల పేరుతో గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలను అరికట్టాలని కోరుతున్నాయి. గిరిజన కుటుంబాల గౌరవం, ఆత్మాభిమానం, వ్యక్తిగత గోప్యతలను పణంగా పెట్టి రుణ వసూళ్లకు దిగితే అది కేవలం ఆర్థిక లావాదేవీగా కాకుండా సామాజిక వేధింపుగా మారుతుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని వాస్తవాలు వెలికితీయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. నేడు ఒక గిరిజన కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితి రేపు మరెన్నో కుటుంబాలకు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా మొర్రేడు వాగు బ్రిడ్జి సమీపంలో గల ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యం తక్షణమే స్పందించి గిరిజన కుటుంబానికి న్యాయం చేయాలని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంస్థ యాజమాన్యానిదేనని వారు హెచ్చరిస్తున్నారు.

# మత్తుకు దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్తు






- **డీ-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన భద్రాచలం డీఎస్‌పీ అరుణ్ కుమార్**

**భద్రాచలం టౌన్, జూన్ 10 ప్రజా జ్యోతి:**

మాదక ద్రవ్యాలు, మద్యం తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఆరోగ్యకరమైన జీవితం, ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని భద్రాచలం డివిజన్ డీఎస్‌పీ అరుణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన పోలీసు సిబ్బందితో కలిసి భద్రాచలంలోని డీ–అడిక్షన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడారు.నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డీ ఎస్‌పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల కు బానిస కావడం వల్ల వ్యక్తిగత ఆరో గ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబ వ్యవస్థ, సామాజిక జీవితం కూడా తీవ్రంగా ప్రభావితమవుతాయని అ న్నారు. చికిత్స అనంతరం బాధితులు పాత అలవాట్లను పూర్తిగా విడిచిపెట్టి ఆత్మవిశ్వాసంతో కొత్త జీవితాన్ని ప్రా రంభించాలని సూచించారు.యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి వి ద్య, ఉపాధి, కుటుంబ బాధ్యతలపై దృ ష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చా రు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగతంగా, సామాజికంగా అనేక సమస్యలకు దారితీస్తుందని వివరించారు. అ నంతరం పర్యావరణ పరిరక్షణలో భా గంగా డీ–అడిక్షన్ సెంటర్ ప్రాంగణం లో డీఎస్‌పీ అరుణ్ కుమార్, సీఐ నాగరాజు పోలీసు సిబ్బందితో కలిసి మొక్క లు నాటారు.సీఐ నాగరాజు, పోలీసు సిబ్బంది, డీఅడిక్షన్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళికపై ప్రత్యేక గ్రామసభ

- **రైతులకు వరి సాగుపై కీలక సూచనలు**





**చర్ల, జూన్ 10: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని గ్రామపంచాయతీ సంతపాకలో బుధవారం "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజులు" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ పూజారి సామ్రాజ్యం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పూజారి సామ్రాజ్యం మాట్లాడుతూ, 99 రోజుల ప్రగతి ప్రణాళికలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించడంతో పాటు ఇంకా చేపట్టాల్సిన పనులపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రత్యేక గ్రామసభను నిర్వహించినట్లు తెలిపారు.ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు మాట్లాడుతూ, ప్రగతి ప్రణాళికలో భాగంగా పంచాయతీ పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, పూర్తికాని పనులను గుర్తించి వాటి అమలుకు చర్యలు తీసుకోవడంలో ఈ సమావేశం ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్లలోని వ్యర్థాలను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి పంచాయతీ పంచాయతీ వాహనానికి ఇవ్వాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేనిచో రానున్న వర్షాకాలంలో వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని కావున అందరూ శుభ్రత పాటించాలని అన్నారు.ఈ సందర్భగా వ్యవసాయ శాఖ అధికారి ఆఫ్రిది రైతులకు వానాకాలం 2026–27 సీజన్ వరి సాగుపై అవగాహన కల్పించారు అని తెలంగాణ ప్రభుత్వం సూచించిన బీపీటీ–5204, ఆర్ఎన్ఆర్–15048, హెచ్ఎంటీ, జై శ్రీరామ్, జేఎజీఎల్–1798, డబ్ల్యూజీఎల్–44, డబ్ల్యూజీఎల్–962 వంటి వరి రకాలను సాగు చేయాలని సూచించారు. ఈ రకాలు మంచి నాణ్యత, అధిక దిగుబడి, మార్కెట్‌లో మెరుగైన డిమాండ్ కలిగి ఉన్నాయని తెలిపారు.అదే సమయంలో కేఎన్ఎం–1638, ఎంటీయూ–1262 వంటి రకాల సాగును నిరుత్సాహపరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ రకాల బియ్యానికి మార్కెట్‌లో డిమాండ్ తక్కువగా ఉండటంతో పాటు రైతులకు ఆశించిన ధరలు లభించే అవకాశం తక్కువగా ఉంటుందని వివరించారు.రైతులు ధృవీకరించిన విత్తనాలను మాత్రమే వినియోగించాలని, ప్రభుత్వ సూచించిన వరి రకాల సాగు ద్వారా మెరుగైన దిగుబడులు, మంచి ధరలు పొందవచ్చని సూచించారు. అలాగే వరి కోత అనంతరం పొలాల్లో మిగిలే వరి అవశేషాలను తగలబెట్టరాదని హెచ్చరించారు. అలా చేయడం వల్ల భూమి సారం తగ్గిపోవడంతో పాటు వ్యవసాయానికి ఉపయోగపడే సూక్ష్మజీవులు నశించి భూసారం దెబ్బతింటుందని తెలిపారు.పొలాల్లో వరి అవశేషాలను తగలబెట్టిన రైతులపై పంచాయతీ ద్వారా రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని, ఇంకా నమోదు చేసుకోని వారు సమీప వ్యవసాయ శాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.గ్రామసభలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు ప్రజల నుంచి వచ్చిన సూచనలు, వినతులను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, వ్యవసాయ అధికారి ఆఫ్రిది, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అశ్వాపురం రైల్వే స్టేషన్‌లో రైళ్లు హాల్ట్ ను ఏర్పాటు చేయాలి

- **ఫ్లాట్‌ఫారమ్, లైటింగ్, టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలి**
- **తుర్రవారిగూడెం సర్పంచ్, ఉప సర్పంచ్ డిమాండ్**

**అశ్వాపురం, జూన్ 10, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రైళ్లను నిలపడంతో పాటు, స్టేషన్‌లో కనీస వసతులు కల్పించాలని తుర్రవారిగూడెం గ్రామ సర్పంచ్ కుంజ జాన్ గారు మరియు ఉప సర్పంచ్ ధరావత్ హర్ష నాయక్ రైల్వే శాఖను డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అశ్వాపురం మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ రైల్వే స్టేషన్ ఎంతో కీలకమైనదన్నారు. అయితే, ఇక్కడ రైళ్లు ఆగకపోవడం వల్ల స్థానిక విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అశ్వాపురంలో స్టేషన్ ఉన్నా, రైలు ఎక్కడానికి పక్క ఊర్లకు వెళ్లాల్సి రావడం సరికాదన్నారు.రైళ్లు ఆపడంతో పాటు స్టేషన్‌లో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని వారు ఎత్తిచూపారు.



**డిమాండ్లు:** రైళ్ల హాల్టింగ్: అశ్వాపురం స్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లు తప్పనిసరిగా ఆగేలా చర్యలు తీసుకోవాలి. ఫ్లాట్‌ఫారమ్ నిర్మాణం: ప్రయాణికులు సురక్షితంగా రైలు ఎక్కేందుకు వీలుగా ఫ్లాట్‌ఫారమ్‌ను ఆధునీకరించాలి. లైటింగ్ సదుపాయం: రాత్రి వేళల్లో ప్రయాణికుల రక్షణ కోసం స్టేషన్ పరిసరాల్లో, ఫ్లాట్ ఫారమ్‌పై హైమాస్ట్ లైట్లు, తగినన్ని విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. టికెట్ కౌంటర్: ప్రయాణికులకు టికెట్లు స్థానికంగానే దొరికేలా తక్షణమే టికెట్ కౌంటర్ తెరవాలి.రైల్వే అధికారులు తక్షణమే స్పందించి రైల్వే స్టేషన్ సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో స్థానిక ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సర్పంచ్, ఉప సర్పంచ్ హెచ్చరించారు. ఈ విషయమై త్వరలోనే ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తామని వారు తెలియజేశారు.

## ఫోర్ లేన్ పనులు పూర్తి చేయాలి

- **అర్ధాంతరంగా నిలిచిన పనులతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**
- **దుమ్ము, ధూళి సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని డిమాండ్**



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 10 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద బుధవారం ఫోర్ లేన్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు జుబ్బురు రమేష్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జుబ్బురు రమేష్ మాట్లాడుతూ అన్నపురెడ్డిపల్లి గుండా వెళ్తున్న ఫోర్ లేన్ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నెలల తరబడి పనులు నిలిచిపోవడం వల్ల రోడ్డు మొత్తం దుమ్ము, ధూళితో నిండిపోయి వాహనదారులు, వ్యాపారులు, స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు స్పందించడం లేదని విమర్శించారు. పనులు ఎందుకు నిలిచిపోయాయో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, ప్రజల ఇబ్బందులకు బాధ్యులెవరో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఫోర్ లేన్ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేయడంతో పాటు ప్రజల తరఫున పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద కొంతసేపు ధర్నా నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు బాల వెంకటరెడ్డి, బాలకిరణ్, జటంగి కృష్ణ, బీజేపీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే వార్డు సభలు



**ఇల్లందు, జూన్ 10 (ప్రజా జ్యోతి )** ప్రజా సమస్యల పరిష్కారానికే వార్డు సభలు ఎంతగానో దోహదపడతాయని మున్సిపల్ కమిషనర్ ఎస్ సందీప్, 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ అన్నారు. బుధవారం ఇల్లందు పట్టణంలోని 22వ వార్డు వాటర్ ట్యాంక్ ఆవరణలో మున్సిపల్ ఆధ్వర్యంలో వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల గడప వద్దకే పాలన తీసుకెళ్లే లక్ష్యంతో వార్డు సభలు నిర్వహిస్తున్నామని, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని సత్వర పరిష్కారానికి ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. వార్డులో తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని స్పష్టం చేశారు. ప్రజల సూచనల మేరకు ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే – ఎస్ఐఆర్ పై ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. ప్రతి కుటుంబం వివరాలు సక్రమంగా నమోదు చేయించుకోవాలని, దీని ద్వారానే భవిష్యత్తులో అన్ని సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. అనంతరం నూతన పెన్షన్లు, కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డులో పేర్ల మార్పు, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందజేశారు. స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హులైన వారందరికీ న్యాయం చేస్తామని, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వార్డు సభలు నిరంతర ప్రక్రియ అని, ప్రతి నెలా ఒకసారి నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అకౌంట్ ఆఫీసర్ జగదీశ్వరి, వార్డ్ ఆఫీసర్ రజిని, జిపిఓ వెంకటరమణ, ఆర్పి మమత, అంగన్వాడి టీచర్లు సక్కుబాయి, యాకమ్మ, కాంగ్రెస్ నాయకులు కోలపురి ఝాన్సీ, ఆలేటి చిన్ని, వార్డు పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

**రెవెన్యూ శాఖ అంటే సాధారణంగా ప్రజలకు గుర్తుకొచ్చేది అధికార హంగులు, ప్రత్యేక వాహనాలు, భద్రతా సిబ్బంది, అధికార దర్పం. భూములు, రిజిస్ట్రేషన్లు, వివాదాలు, ఆదాయ వనరులతో ముడిపడి ఉండే ఈ శాఖలో ఉన్నత హోదాల్లో పని చేసే అధికారులంటే ఆడంబర జీవన శైలి అనే అభిప్రాయం సమాజంలో బలంగానే ఉంది. అయితే ఆ అభిప్రాయాలన్నింటికీ భిన్నంగా నిలుస్తూ, మూడు దశాబ్దాలుగా నిష్కళంక సేవ లందిస్తున్న అధికారి ఎం. వెంకట రవీంద్రనాథ్. ఉన్నత హోదాల్లో పనిచేస్తున్నప్పటికీ సాధారణ ప్రజలతో కలిసి బస్సుల్లో ప్రయాణించడం, కాలినడకన ఇంటికి చేరుకోవడం, చట్టాల అమలులో రాజీ పడకపోవడం, ప్రజా సేవను బాధ్యతగా భావించడం ఆయనను ప్రత్యేక అధికారిగా నిలబెట్టాయి. హోదాను మించిన వినయంతో, అధికారానికి కొత్త నిర్వచనం చెబుతూ ప్రజా సేవను జీవిత ధ్యేయంగా మార్చుకున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. వెంకట రవీంద్రనాథ్ జీవన ప్రస్థానంపై ప్రజా జ్యోతి ప్రత్యేక కథనం.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి
(భూక్యా రంజిత్ నాయక్)

# హోదాను మించిన వినయం...
# అధికారానికి కొత్త నిర్వచనం

- **రెవెన్యూ శాఖలో అరుదైన అధికారిగా ప్రత్యేక గుర్తింపు**
- **అహంకారానికి ఆమడదూరం... నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం**
- **రెవెన్యూ చట్టాల్లో తిరుగులేని నిపుణుడు**
- **'32 జీబీ అధికారి'గా సహచరుల ప్రశంసలు**
- **మూడు దశాబ్దాల సేవలో ఒక్క మెమో లేదు... ఒక్క మచ్చ లేదు**
- **పదవిని హోదాగా కాదు... బాధ్యతగా భావించిన అధికారి**
- **నేటి యువతకు, యువ అధికారులకు స్ఫూర్తిదాయకమైన జీవన ప్రస్థానం**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం ఎర్రగుంట గ్రామానికి చెందిన వెంకట రవీంద్రనాథ్ తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. కుటుంబం భద్రాచలంలో స్థిరపడటంతో ఆయన విద్యాభ్యాసం అక్కడే కొనసాగింది. చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన ఆయన వ్యక్తిత్వానికి పునాది అయ్యాయి. ఉద్యోగ బాధ్యతల మధ్య కూడా చదువును కొనసాగిస్తూ ఏకంగా నాలుగు పీజీ డిగ్రీలు పూర్తి చేశారు. ఉద్యోగం ఒకవైపు, విద్య మరోవైపు కొనసాగించడం ఆయన పట్టుదలకు నిదర్శనం. జ్ఞానం సంపాదించడం నిరంతర ప్రక్రియ అని తన జీవితంతో నిరూపించారు.

## మూడు దశాబ్దాల సేవలో ఒక్క మెమో లేదు... ఒక్క మచ్చ లేదు

1998లో గ్రూప్-2 అధికారిగా ప్రభుత్వ సేవలో అడుగుపెట్టిన రవీంద్రనాథ్, 2000లో తహసీల్దార్‌గా, అనంతరం 2011లో ఆర్డీవోగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సుదీర్ఘ సేవా కాలంలో ఆయనపై ఒక్క మెమో కూడా జారీ కాలేదు. అవినీతి ఆరోపణలు, క్రమశిక్షణా చర్యలు, వివాదాలు లేకుండా విధులు నిర్వహించడం నేటి పరిస్థితుల్లో అరుదైన విషయమే. ప్రభుత్వ సేవలో నిజాయితీ, నిబద్ధతకు ఆయన కెరీర్ నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.

## సైకిల్‌పై గిరిజన గూడాలకు చేరిన అధికారి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు ప్రాంతంలో తహసీల్దార్‌గా పనిచేసిన రోజుల్లో రవీంద్రనాథ్ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. రహదారులు సరిగా లేని రోజుల్లో సైతం సైకిల్‌పై గిరిజన గూడాలకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకునేవారు. కార్యాలయంలో కూర్చొని ఆదేశాలు ఇవ్వడం కంటే ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడమే నిజమైన పరిపాలన అని ఆయన విశ్వసించారు. అదే తత్వం ఆయనకు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

## హోం మినిస్టర్‌కైనా ఒకే నిబంధన

నిజాయితీని నమ్మే అధికారి ఎవరైనా ఒత్తిళ్లకు తలవంచరు. అలాంటి వ్యక్తిత్వానికి రవీంద్రనాథ్ నిదర్శనం. మహేశ్వరం ఆర్డీవోగా పనిచేసిన సమయంలో అప్పటి హోం మంత్రి సిఫారసు చేసిన అంశాన్ని కూడా నిబంధనల ప్రకారమే పరిశీలించినట్లు సహచర అధికారులు గుర్తుచేసుకుంటారు. హోదా ఎంత పెద్దదైనా చట్టం ముందు అందరూ సమానమే అన్న సందేశాన్ని ఆయన ఆచరణలో చూపించారు. అధికారాన్ని వ్యక్తుల కోసం కాకుండా చట్టాల కోసం వినియోగించాలనే ఆయన ధోరణి అనేక మందికి ఆదర్శంగా నిలిచింది.

## రెవెన్యూ చట్టాల్లో తిరుగులేని నిపుణుడు

రెవెన్యూ శాఖలో క్లిష్టమైన కేసులు, భూ వివాదాలు, పరిపాలనా అంశాలపై రవీంద్రనాథ్‌కు ఉన్న అవగాహన ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఏ చట్టంలోని ఏ నిబంధన ఎక్కడ వర్తిస్తుందో క్షణాల్లో వివరించగల సామర్థ్యం ఆయన సొంతం. అనేక సందర్భాల్లో ఉన్నతాధికారులు సైతం ఆయన అభిప్రాయాలను కోరడం, క్లిష్ట అంశాలపై సలహాలు తీసుకోవడం ఆయన నైపుణ్యానికి నిదర్శనం.

## '32 జీబీ అధికారి'గా సహచరుల ప్రశంసలు

ఫైళ్లపై పట్టు, చట్టాలపై అవగాహన, అసాధారణ జ్ఞాపకశక్తి కారణంగా సహచర అధికారులు సరదాగా ఆయనను "32 జీబీ అధికారి" గా పిలుస్తుంటారు. ఫైళ్లు చూడకుండానే సర్వే నంబర్లు, కేసు వివరాలు, చట్టాల నిబంధనలు గుర్తుచేసి చెప్పగల అసాధారణ జ్ఞాపకశక్తి ఆయన సొంతం. ఏళ్ల క్రితం జరిగిన ఘటనల తేదీలు, భూ సర్వే నంబర్లు, పరిపాలనా నిర్ణయాలను సైతం వెంటనే వివరించగలగడం ఆయన ప్రత్యేకత. అందుకే శాఖలో ఆయనను "నడిచే విజ్ఞాన సర్వస్వం"గా అభివర్ణిస్తుంటారు.

## ఎంక్వయిరీ ఆఫీసర్ అంటే నిష్పాక్షికతకు నిదర్శనం

ఏదైనా అధికారి లేదా ఉద్యోగిపై విచారణ నిర్వహించాల్సి వచ్చినప్పుడు రవీంద్రనాథ్‌ను ఎంక్వయిరీ ఆఫీసర్‌గా నియమిస్తే, ఆ నివేదికలో వాస్తవాలే ఉంటాయనే నమ్మకం ఉన్నతాధికారుల్లో ఉంది. ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా నిజాలను మాత్రమే నమోదు చేసే అధికారిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. అందుకే శాఖలో నిష్పాక్షికతకు ఆయన పేరే ఒక ప్రమాణంగా మారింది.

## కీలక భూసేకరణల్లో ప్రభుత్వానికి అండగా

ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం ప్రాంతాల్లో సింగరేణి విస్తరణలు, బీటీపీఎస్ ప్రాజెక్టు, ఇతర ప్రభుత్వ ప్రాజెక్టుల భూసేకరణలో ఆయన కీలక పాత్ర పోషించారు. ప్రభుత్వ అవసరాలు, ప్రజల హక్కులు రెండింటినీ సమతుల్యం చేస్తూ వ్యవహరించడం ద్వారా మంచి పరిపాలకుడిగా గుర్తింపు పొందారు. క్లిష్టమైన అంశాలను సామరస్యంగా పరిష్కరించడం ఆయన పరిపాలనా నైపుణ్యాన్ని చాటింది.

## హౌసింగ్ శాఖలో ప్రత్యేక ముద్ర

హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో ఆయన పనితీరు రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. పేదల గృహ కలలను సాకారం చేయడంలో చూపిన చొరవ ప్రభుత్వ దృష్టిని ఆకర్షించింది. సమర్థత, క్రమశిక్షణ, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిన నిబద్ధతతో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రభుత్వ యంత్రాంగంలో విశ్వసనీయ అధికారిగా పేరు సంపాదించారు.

## ఏసీ కారు కాదు... ఆర్టీసీ బస్సే ప్రయాణం

నేటి కాలంలో చిన్న హోదా వచ్చినా ప్రత్యేక వాహనాల కోసం ఆసక్తి చూపే వారిని చూస్తుంటాం. కానీ రవీంద్రనాథ్ మాత్రం ఉన్నత హోదాల్లో ఉన్నప్పటికీ సాధారణ ప్రజలతో కలిసి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడానికే ఇష్టపడతారు.

విధులు ముగిసిన తర్వాత బస్సులో భద్రాచలం చేరుకుని, అక్కడి నుంచి తన నివాసమైన శాంతినగర్ వరకు కాలినడకనే వెళ్లడం ఆయనకు అలవాటు. తాను ఉన్నతాధికారిననే విషయం తెలియకుండా ప్రజల మధ్య కలిసిమెలిసి ఉండడం ఆయన నిరాడంబరతకు నిదర్శనం.

## అధికార హోదా కన్నా మానవత్వానికే పెద్దపీట

పదవులు శాశ్వతం కావు... కానీ వ్యక్తిత్వం శాశ్వతం. ఈ సత్యాన్ని రవీంద్రనాథ్ తన జీవితంతో నిరూపిస్తున్నారు. అధికారాన్ని గౌరవం పొందడానికి కాకుండా ప్రజలకు సేవ చేయడానికి ఉపయోగించాలనే ఆయన తత్వం అనేక మందిని ప్రభావితం చేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం జీతం తీసుకోవడం కాదు... సమాజానికి బాధ్యతగా సేవ చేయడం అనే విషయాన్ని ఆయన జీవితం గుర్తుచేస్తోంది.

## నేటి తరానికి స్ఫూర్తి

నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ, నిరాడంబరత, ప్రజాసేవ, నిష్పాక్షికత... ఈ విలువలన్నీ ఒకే వ్యక్తిలో కనిపిస్తే అది ఎం. వెంకట రవీంద్రనాథ్ వ్యక్తిత్వమే. అధికారాన్ని హక్కుగా కాకుండా బాధ్యతగా భావించడం, హోదాను గౌరవంగా కాకుండా సేవకు సాధనంగా చూడడం, ప్రజల మధ్యే ఉండి ప్రజల కోసమే పనిచేయడం... ఇవన్నీ కలిస్తే కనిపించే వ్యక్తిత్వమే రవీంద్రనాథ్. నేటి కాలంలో పదవులు పెరిగే కొద్దీ ప్రజలకు దూరమవుతున్న అధికారుల మధ్య, ప్రజలకు మరింత చేరువవుతూ హోదా కంటే మానవత్వానికే పెద్దపీట వేస్తున్న రవీంద్రనాథ్ వంటి అధికారులు ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నారని జిల్లా వాసులు అంటున్నారు.





